క్లుప్తంగా

లింగాపూర్ ఇన్‌చార్జి ఎంపీవోగా శ్రీనివాస్‌రెడ్డి



సన్మానిస్తున్న సిబ్బంది

లింగాపూర్: మండల ఇన్‌చార్జి ఎంపీవోగా శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఉమర్‌షరీఫ్ బదిలీపై జన్నారం మండలానికి బదిలీకాగా ఆయన స్థానంలో పిట్టగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

లింగాపూర్: మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ కార్యవర్గాన్ని మండలకేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రజనీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, ట్రెజరీ జగదీశ్, జనరల్ సెక్రటరీ పాపయ్య, సలహాదారులు కిరణ్, శ్రీనివాస్, రాంసాగర్, బారిక్‌రావు, ఆంబాజీరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా సవత మాలి వర్ధంతి



వర్ధంతి నిర్వహిస్తున్న మాలి కులస్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం మాలి కులస్తుల మహాగురువు, దైవ భక్తిపరుడు సవత మాలి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విఠలేశ్వరుడుని తన హృదయంలో పెట్టి పూజించే ఏకైక భక్తుడు సవత మాలి అని వారు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ వాడై సోనేరావు, గ్రామ పెద్దలు నగేశ్, నారాయణ, శ్రీకాంత్, శ్రీనివాస్, రాంచందర్, మహదు, బాపూదేవ్ తదితరులు ఉన్నారు.

‘స్వచ్ఛదనం- పచ్చదనం’పై గ్రామసభలు



కొఠారిలో కొనసాగుతున్న గ్రామసభ

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లను గ్రామ కమిటీలో చేర్చారు. ఈ నెల 5 నుంచి 9 వరకు కొనసాగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న రజాక్

కెరమెరి: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రజాక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటితే అధికంగా వృక్షాలు పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం -పచ్చదనం పేరిట నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఏ మహేందర్, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.

నేడు బోనాలు

కౌటాల: మండల కేంద్రంలోని గుట్టపై గల కంకలమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం కౌటాల రామాలయం నుంచి కంకలమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. పూజల అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయం ఆవరణలో 250 మొక్కలు నాటుతామన్నారు.

ప్రకృతివనంపై గొడ్డలి వేటు

- మొక్కలకు రక్షణ కరువు
- ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్న కాపరులు
- పశువులకు మేతగా మారుతున్న మొక్కలు
- ఖమాన జీపీలోని ఐదు వనాల్లోనూ ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఖమాన పల్లె ప్రకృతి వనంలో నరికేసిన చెట్లు

వాంకిడి: పల్లెల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ఒక్కో పార్కులో వేల సంఖ్యలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి ఉండగా అనేక వనాల్లో వాటికి రక్షణ కరువైంది. గ్రామపంచాయతీల నుంచి రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వనాల నిర్వాహణ గాలికి వదిలేయడంతో అవగాహన లేని పశువుల కాపర్లు ఏపుగా పెరిగిన చెట్లను గొడ్డలితో నరికి వేస్తున్నారు. మండలంలోని ఖమాన గ్రామ పంచాయతీ పరిధిలో ఒక మండల స్థాయి పార్కు (బృహత్‌వనం)తో పాటు హాబిటేషన్‌కు ఒకటి చొప్పున ఐదు ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వాటి ఏర్పాటుకు గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేయగా సంబంధిత అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

కరువైన పట్టింపు..

మండలంలోని అనేక గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వనాలు అధ్వానంగా దర్శనమిస్తుండగా.. ఖమాన గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెవనాల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ గ్రామ పంచాయతీలో లేని విధంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి గాలికి వదిలేసిన తీరు అనేక విమర్శలకు దారి తీస్తుంది. గ్రామ పంచాయతీలో ఖమాన, గొల్లగూడ, పాతగూడ, పూనగూడ, సాలెగూడ మొత్తం 5 హాబిటేషన్‌లు ఉన్నాయి. కాగా ప్రతీ హాబిటేషన్‌కు ఒకటి చొప్పున పూనగూడ గ్రామానికి వెళ్లే దారిలో గల ప్రభుత్వ భూమిలో మండల స్థాయి మెగాపార్కుతో పాటు మరో నాలుగు పార్కులు ఒకే చోట ఏర్పాటు చేశారు. సాలెగూడ పార్కును మరో చోట ఏర్పాటు చేశారు. 2020లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలలో రెండు సంవత్సరాల పాటు మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు ఉపాధిహామీ నుంచి నిధులు కేటాయించారు. ఆ తర్వాత వనాల నిర్వాహణ బాధ్యతను పూర్తిగా గ్రామ పంచాయతీలకే అప్పగించగా ఖర్చులతో పాటు నిర్లక్ష్యం కూడా అదే స్థాయిలో పెరిగింది. నాటిన మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, సిమెంట్ పోల్స్ పడిపోయాయి. మరి కొన్ని వనాలకు అసలు ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు మొక్కలను నాశనం చేస్తున్నాయి. కొందరు పశువుల కాపర్లు ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు.

ప్రకృతి వనాల ఖర్చు రూ.8.61 లక్షలు..

మండలంలోని ఖమాన గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వాహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమకూరిన జీపీ నిధుల నుంచి రూ.8.61 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. పల్లె ప్రకృతి వనాల స్థలం లెవలింగ్, సిమెంట్ పోల్స్ కొనుగోలు, ఫెన్సింగ్ వైర్, నాటిన మొక్కలకు నీరు పట్టేందుకు ఆయిల్ ఇంజన్, ప్రైవేటు నర్సరీల నుంచి రకరకాల మొక్కల కొనుగోలు, ఇటుకలు, లేబర్ కూలీలు, కలుపుతీత, గేట్ కొనుగోలు, తదితర పనులకు గాను ఖర్చు మొత్తం రూ.8.61 లక్షలు అయినట్లు ఆర్టీఐ చట్టం ద్వారా బయటపడింది. అయితే లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న వనాలు మాత్రం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచలేకపోతున్నాయి. కాగా పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల నరికివేతపై వివరణ కోరేందుకు మండల పంచాయతీ అధికారి ఖాజా అజిజుద్దీన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా ఇందులో వివరణ ఇవ్వడానికి ఏమీ లేదంటూ ఫోన్ కట్ చేయడం గమనార్హం.

వందల చెట్లు నరికేశారు..



బృహత్ ప్రకృతి వనంతో పాటు పల్లె ప్రకృతి వనాల్లోనూ నిత్యం పశువులు సంచరిస్తూ చెట్లను తినేస్తున్నాయి. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉండగా కొన్ని వందల చెట్లు నేలకొరిగాయి. అవగాహన లేని పశువుల కాపర్లు చెట్లను నరికేస్తున్నారు. పంచాయతీ నిధుల నుంచి లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న ప్రకృతి వనాలను నిర్లక్ష్యం చేయడం సరికాదు.

- ఉయికె రాము, పూనగూడ

ప్రజాధనం వృథా..



పల్లెప్రకృతి వనాలకు లక్షల రూపాయలు వెచ్చించి నిర్వాహణ మరిచిపోవడంతో ప్రజాధనం వృథా అవుతుంది. గ్రామాలకు దూరంగా పార్కులు ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. పార్కుల్లో నాటిన మొక్కలను కూడా సంరక్షించడం లేదు. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి.

- ఎనగంటి ప్రవీణ్ యాదవ్, ఖమాన

అనారోగ్యంతో బాలింత మృతి



రజిత (ఫైల్)

తిర్యాణి: మండలంలోని గోయెగాం గ్రామానికి చెందిన బాలింత అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గోయెగాం గ్రామానికి చెందిన గంధం రజిత(30) గత నెల 4న రెండవ కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆరోగ్యం క్షీణించడంతో కాన్పు జరిగిన ఐదు రోజుల తరువాత ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో కణితి ఏర్పడడంతో రజితకు తరచూ మూర్ఛ వ్యాధి వస్తుందని నిర్ధారించారు. కాగా చికిత్స నిమిత్తం శనివారం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా రజిత మార్గమధ్యలో మృతి చెందింది.

ఇరిగేషన్ ఏఈఈగా దీపక్ ఎంపిక



రాంటెంకి దీపక్

కౌటాల: మండలంలోని భాలేపల్లి గ్రామానికి చెందిన రాంటెంకి దేవాజీ -లైజుబాయి దంపతుల కుమారుడు రాంటెంకి దీపక్ ఇరిగేషన్ ఏఈఈగా ఎంపికయ్యారు. గతేడాది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగం ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం రాత్రి వెలువరించింది. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన దీపక్‌ను గ్రామస్తులు అభినందించారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



ఆవరణలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: మండలంలోని గురుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పాఠశాల ఆవరణలో వరద నీరు నిలుస్తుందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నీరు నిల్వ ఉండడంతో పిల్లలు నీళ్లలో జారి పడుతున్నారని, పాఠశాలలో దుర్వాసన వెదజల్లుతుందని వాపోయారు. పాఠశాల ఆవరణలోని నిల్వ నీటిని తొలగించకుంటే తమ పిల్లలను బడికి పంపమన్నారు. ఎంపీడీవో కోట ప్రసాద్, మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడి పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకాధికారి రాజేశ్, హెచ్‌ఎం సాయినాథ్, పంచాయతీ కార్యదర్శి సునీత, సీఆర్పీ లాలాజీ, తదితరులు ఉన్నారు.

‘పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..’



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పేదల పక్షాన నిరంతర పోరా టాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని సీపీఎం రా ష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ స్పష్టం చే శారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య వి జ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి రా జకీయ శిక్షణ తరగతులకు జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మా ట్లాడుతూ.. జిల్లాలోని కుమురంభీం ప్రా జెక్టుకు మర మ్మతు చేయించి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి, వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. పేద, కార్మిక, దళిత, గిరిజనుల పక్షాన ఉంటూ కమ్యూనిస్టు పార్టీ పోరాడుతూ వారికి అండగా నిలుస్తోందని చెప్పారు. జిల్లాలో పోడు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శిక్షణ తరగతులకు జిల్లా కమిటీ సభ్యులు దుర్గం దినకర్, మంజుల ఆనంద్, గొడిసెల కార్తిక్, రాజ్‌కుమార్, బక్కన్న, మాలశ్రీ, కమల, వివిధ మండలాల ప్రతినిధులు హాజరయ్యారు.

పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరం



నాగేపల్లిలో నిర్వహిస్తున్న వారోత్సవాలు




సుర్దాపూర్‌లో..

కౌటాల: పసి పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని నాగేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. అదే విధంగా మండలంలోని గురుడుపేట, నదీమాబాద్, సదాశివపేట, విజయనగరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరా బేగం, ఎంపీడీవో కోట ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, జీజాబాయి, సరోజ, అనిత, ఆశ వర్కర్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

డబ్బాపాలతో బిడ్డకు హాని

కెరమెరి: డబ్బాపాలతో పుట్టిన బిడ్డకు హాని కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్త బొజ్జుబాయి అన్నారు. సుర్దాపూర్‌లో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. తల్లి పాలు తాగిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు.

‘సమస్యల పరిష్కారానికి కృషి’



రోడ్డును పరిశీలిస్తున్న తిరుపతి

తిర్యాణి: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గిరిజన కో -ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. శనివారం దండేపల్లి మండలంలోని ఊట్ల గ్రామం నుంచి తిర్యాణి మండలం గుండాల గ్రామం వరకు ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతన రోడ్డు నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. గుండాల గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ చీఫ్ ఇంజనీర్ శంకర్, మాజీ ఎంపీటీసీ కోవ మోతీరాం, ఆదివాసీ సంఘాల నాయకులు మర్సుకోల అశోక్, శంకర్, దౌలత్‌రావు, సోనేరావు, బాలకిషన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కొత్తకాలనీ ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్‌ను తాకి కొత్తకాలనీ గాజిరెడ్డి లచ్చన్న అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. సపోర్ట్ వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా బాధితరైతుకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు తోడ్పడాలి



కమిటీని ప్రకటిస్తున్న మల్రాజు శ్రీనివాస్ రావు

రెబ్బెన: టీబీజీకేఎస్ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ సింగరేణి కార్మిక హక్కుల పరిరక్షణలో తోడ్పాటు అందించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆమోదంతో 30 మందితో కూడిన ఏరియా కమిటీని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి హక్కులు, సంక్షేమం కోసం టీబీజీకేఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. టీబీజీకేఎస్ అధిష్ఠానం ఆమోదంతో ఏరియా పూర్తి కమిటీని ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన నూతన కమిటీ

టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడిగా మల్రాజు శ్రీనివాస్‌రావు, ఏరియా కార్యదర్శులుగా మారిన వెంకటేశ్వర్లు, అలవేని సంపత్, కోశాధికారిగా మహేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రవీందర్, సంపత్ తిరుపతి, వెంకటస్వామి, దేవేందర్, సంయుక్త కార్యదర్శులుగా చంద్రయ్య, శ్రీనివాస్, అనేష్, ఎండీ ఉస్మాన్, ఉమెన్ రెప్రజెంటేటీవ్‌గా వరలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా రాజేశం, వెంకటేశం, రవీందర్, రమేశ్, మంగీలాల్, ప్రశాంత్, వీరన్న, శ్రీనివాస్, క్రిష్ణ, విద్యాసాగర్, రాజేందర్, బాపు, రాజు, అజాస్, సత్యనారాయణ, కుమారస్వామిలను ఎంపిక చేశారు.

‘ఆదివాసీ దినోత్సవం’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

సిర్పూర్(టి): ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లో నిర్వహించే ఆదివాసీ దినోత్సవంలో సంస్కృతి సాంప్రదాయాలతో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు గోపాల్, అర్జు, నగేశ్, భగవంత్‌రావు, రాంసా, భీంరావ్, మారు, శ్రీనివాస్, రాకేశ్, వెంకటేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

తిర్యాణి: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఆదివాసీ దినోత్సవం వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యకమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాశ్, మండల అధ్యక్షుడు తోడసం భాస్కర్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



చింతలమానెపల్లి: సన్మానిస్తున్న సిబ్బంది



పెంచికల్‌పేట్‌లో..

చింతలమానెపల్లి: మండల ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్ పెంటు, అటెండర్ రహమాన్, కార్యదర్శులు అనూష, రమేశ్‌లకు ఎంపీడీవో కోట ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

ఎంపీవో గంగాసింగ్‌కు సన్మానం

పెంచికల్‌పేట్: మండల ఎంపీవోగా పని చేసిన గంగాసింగ్ బదిలీపై బాసర మండలానికి వెళ్తున్న సందర్భంగా మండల మాజీ సర్పంచులు, నాయకులు, అధికారులు శనివారం మండల కేంద్రంలో ఆయనను సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, చంద్రమౌళి, సంజీవ్, సుధాకర్, రాజన్న, నాయకులు సముద్రాల రాజన్న మాజీ ఎంపీటీసీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



మాట్లాడుతున్న గుల్లం చక్రపాణి

రెబ్బెన: తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గుల్లం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టేందుకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించడాన్ని జిల్లా ఆర్యవైశ్య మహాసభ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తే ఆర్యవైశ్య మహాసభల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా యువజన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి లోకేష్, జిల్లా తిర్యాణి మండల అధ్యక్షుడు విఘ్నేష్, మండల కోశాధికారి వెంకటేష్, నాయకులు దత్తు పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ధరణి పోర్టల్‌లో వివిధ భూసమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను రెవెన్యూ రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించాలని, పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు జతచేసిన దస్తావేజులు, ధ్రువపత్రాలు పరిశీలించి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. జిల్లాలో భూసమస్యల కోసం ధరణి పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ లాగిన్‌లలో 593 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని ప్రత్యేక దృష్టి సారించి 10 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివాదాలకు సంబంధించి దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. సీసీఎల్‌ఏ నుంచి తిరిగి వచ్చిన దరఖాస్తులను పునఃపరిశీలించి పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావ్, సురేశ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

ఇచ్చోడ: సైబర్ నేరాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సునీల్ మనోహర్ అన్నారు. శనివారం బ్యాంక్‌లో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాలో జమ చేస్తున్నందును కొంత మంది సైబర్ నేరగాళ్లు ఫోన్‌లకు మోసపూరిత లింకులు పంపుతున్నారని తెలిపారు. నిరాక్షరాస్యత, అమాయక రైతులు మోసపోయే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులకు ఎలాంటి సందేహం ఉన్న నేరుగా బ్యాంకులోకి వచ్చి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంతోష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.